
సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 21 । జూన్ । 2023



పుష్పాలంకరణలో పైడితల్లి
కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళ వారం భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో



వైభవంగా జగన్నాథుని రథయాత్ర
జగన్నాథుని రథయాత్ర మహోత్సవం పట్టణంలోని వలు ప్రాంతాల్లో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. - 8లో



రీసర్వేలో లక్ష్యాలు అధిగమించాలి
నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు



భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ భామిని మండలం కాట్రగడ-బి సచివాలయంలో మంగళవారం ప్రారంభమైంది. పక్కుడుభద్రకు చెందిన రైతు శాసనపురి గణేశ్వరరావు తన భూమి అమ్మకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాలయ సిబ్బంది సంతోష్, శ్రీకన్యలు పూర్తిచేశారు. వీరికి తహసీల్దార్ నీలాపు అప్పారావు, హిరమండలం సబ్‌రిజిస్ట్రార్ సూచనలు చేశారు.

డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గ్వాలియర్‌లోని లక్ష్మీబాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, డిప్లమో ఇన్‌స్పోర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 0751–4000887 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్స్ (స్పెషల్ ఎడ్యుకేషన్) విభాగంలో నాలుగు సంవత్సరాలుగా పదోన్నతిపై భర్తీ కాకుండా మిగిలిన పీహెచ్‌సీ–వీహెచ్, ఎస్టీ రిజర్వేషన్ పోస్టులను జనరల్ కేటగిరీలో భర్తీకి చర్యలు తీసుకున్నామని డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ మేరకు రూపొందించిన ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24లోగా డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవన్నారు.

జి–20 సదస్సులో నెల్లిమర్ల విద్యార్థిని

నెల్లిమర్ల: పట్టణంలోని రెల్లివీధి బాలికోన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పెదమజ్జి సౌభాగ్య న్యూ ఢిల్లీలో మంగళవారం జరిగిన జి–20 సదస్సులో పాల్గొంది. విజయనగరం జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి గ్రూపు కార్యక్రమాలైన కమ్యూనిటీ లెవల్, స్కూల్ లెవల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రోగ్రాంపై సదస్సులో ఉపన్యసించింది. కళాశాల స్థాయిలో జరిగే సేఫ్ లైఫ్ హెల్త్ క్యాంపింగ్‌ను వివరించింది. బాలికల విద్య, ఆరోగ్యం, నైపుణ్య వికాసంపై చేపట్టే వినూత్న కార్యక్రమాలను జి–20 సదస్సులో వివరించేందుకు దేశంలో కేవలం మూడు రాష్ట్రాలకు చెందిన కిశోర బాలికలకు మాత్రమే అవకాశం రాగా అందులో సౌభాగ్య ఒకరు కావడం గమనార్హం. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి మనసుఖ్ మాండవీయ సఖి స్టాల్‌ను సందర్శించి, సౌభాగ్యను అభినందించారు. యూనిసెఫ్ భాగస్వామ్యంతో సఖి ఆచరణ విధానాలను వివరించేందుకు వెళ్లిన విద్యార్థిని కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు అభినందించారు.

రూ.4.20 కోట్ల వైఎస్సార్ పశుబీమా చెల్లింపు

- జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ వై.వి.రమణ

బొండపల్లి: జిల్లాలో వైఎస్సార్ పశు బీమా కింద 2022 డిసెంబర్ నెల వరకు రూ.4.20కోట్లను పశువులు నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేసినట్టు పశు సంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వై.వి.రమణ తెలిపారు. బొండపల్లి మండలం బిల్లలవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ పశు బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1400 మంది పాడిరైతుల ఖాతాలకు బీమా సొమ్ము జమచేసినట్లు వెల్లడించారు. లబ్ధిదారుల వివరాలను ఆర్‌బీకేలలో ఉంచామన్నారు. రెండు నెలలు వయస్సు ఉన్న దూడ నుంచి 10 ఏళ్ల వయస్సులోపు వయస్సు ఉన్న పశువులు మరణిస్తే బీమా పథకం వర్తిస్తుందన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న రైతులు రూ.30 వేలు విలువచేసే పశువుకు రూ.384లు చెల్లిస్తే ప్రభుత్వం మరో రూ.1536లను (80శాతం) రైతుల తరపున చెల్లిస్తోందన్నారు. దారిద్రరేఖకు ఎగువన ఉన్న రైతులుకు ప్రభుత్వం 50 శాతం ప్రీమియం రైతుల తరపున చెల్లిస్తోందని చెప్పారు. బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా సహాయ డైరెక్టర్ పి.రామ్మోహనరావు, బొండపల్లి, రాచకిండాం పశువైద్యాధికారులు ఎం.కిరణ్‌కుమార్, డి.లక్ష్మీదీపిక, గ్రామ నాయకులు సుంకరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడితో చదువుకు భరోసా



పార్వతీపురం జిల్లా కేంద్రంలో మూడోవిడత అమ్మఒడి చెక్కును విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

- నాలుగో విడత అమ్మఒడి నిధుల విడుదలకు సర్కారు సిద్ధం
- ఈనెల 28న కురుపాం వేదికగా నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రైవేటు పాఠశాలల్లో చదివే పేద కుటుంబాల విద్యార్థులకు పథకం వర్తింపు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 97,761 మంది విద్యార్థులకు ప్రయోజనం

పార్వతీపురంటౌన్: పేదలను, అనాథలను పట్టించుకోని గత ప్రభుత్వాలతో విసుగెత్తిన ప్రజలకు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అండగా నిలిచారు. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి.. నిరుపేదల కుటుంబాలకు పెద్ద దిక్కులా మారారు. మనసుంటే మార్గం ఉంటుందనే చందంగా 'అమ్మ ఒడి' పథకాన్ని తీసుకొచ్చి పేదల బిడ్డల చదువుకు ఆలంబన అయ్యారు. గతంలో చాలా మంది పేదలు ఆర్థిక సమస్యల కారణంగా పిల్లలకు బడికి కాదని పనులకు పంపేవారు. ప్రజా సంకల్పయాత్రలో నిరుపేదల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి చదవాలనే ఉద్దేశంతో 'అమ్మఒడి'ని తీసుకొచ్చారు. చదువుకు పేదరికం అడ్డు కారాదంటూ ఆయన తీసుకున్న నిర్ణయం విద్యార్థుల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి నాల్గవ విడత అమ్మ ఒడి పథకానికి 97,761 మంది అర్హత సాధించారు.

ఈ నెల 28న నిధులు విడుదల

అమ్మ ఒడి పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2020 జనవరి 26న ప్రారంభించింది. ఈ నెల 28న వరుసగా నాల్గో ఏడాది జిల్లాలోని కురుపాం వేదికగా అమ్మఒడి నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేయనున్నారు. తెలుపు రేషన్‌కార్డు కలిగి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివించే పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు పథకం కింద సాయం అందజేస్తారు. అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేలలో పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయిస్తారు. మిగతా రూ.13 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేస్తారు.

జిల్లాలో మూడేళ్లలో అమ్మఒడి పథకం లబ్ధిదారుల సంఖ్య			
నియోజకవర్గం	2019–20	2020–21	2021–22
పార్వతీపురం	19,396	16,732	19,782
సాలూరు	19,607	17,644	20,541
కురపాం	24,033	20,408	23,788
పాలకొండ	20,785	20,106	22,298

జిల్లాలో మూడేళ్లలో చేకూరిన లబ్ధి రూ.కోట్లలో...			
నియోజకవర్గం	2019–20	2020–21	2021–22
పార్వతీపురం	29,09,40,000	25,09,80,000	29,67,30,000
సాలూరు	29,41,05,000	26,46,60,000	30,81,15,000
కురపాం	36,04,95,000	30,61,20,000	35,68,20,000
పాలకొండ	31,17,75,000	30,15,90,000	33,44,70,000

చాలా ఉపయోగకరం



మాది పార్వతీపురం పట్టణం. నా భర్త ఆటో నడుపుతూ నాతోపాటు కుమార్తె, కుమారుడిని పోషిస్తున్నారు. పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలు చదువుతున్నారు. గతంలో పిల్లలకు పుస్తకాలు కొనుగోలుచేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. మూడేళ్లుగా ఆ కష్టాలు లేవు. ఏటా 'అమ్మ ఒడి' పథకం కింద నా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవుతున్నాయి. పిల్లలను చక్కగా చదివించుకుంటున్నాము. పిల్లల చదువులు బాగుండాలని కోరుకుంటున్న జగనన్న పదికాలాల పాటు చల్లగా ఉండాలి.

– పొందూరు లలిత, విద్యార్థిని తల్లి, పార్వతీపురం

చెప్పలేని ఆనందం



మధ్యతరగతి కుటుంబానికి చెందిన మేము రెక్కల కష్టంపై బతుకుతున్నాం. ఇతర ప్రాంతం నుంచి వచ్చి పాలకొండలో చిరువ్యాపారం చేసుకుంటున్నాం. జగనన్న ఇచ్చిన అమ్మఒడి నగదు పథకం మా పిల్లల చదువుకు అండగా నిలుస్తోంది. జగనన్న అమలు చేస్తున్న పథకాలు మా లాంటి కుటుంబాల్లో ఆర్థిక ధైర్యం నింపుతున్నాయి.

– డి.వెంకటలక్ష్మి, అమ్మ ఒడి లబ్ధిదారు, పాలకొండ

చదువుబెంగ తీరింది.



మా కుమార్తె అవీల. పార్వతీపురంలో 8వ తరగతి చదువుతోంది. మూడేళ్లుగా అమ్మఒడి డబ్బులు జమవుతున్నాయి. కుటుంబ పెద్దగా జగనన్న పిల్లల చదువుల బాధ్యతను భుజాన వేసుకున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– ఎస్.నిర్మలాకుమారి, విద్యార్థినితల్లి, పార్వతీపురం

జాబితా సిద్ధం చేస్తున్నాం

అమ్మఒడి పథకం నాల్గో ఏడాది నిధులను ఈ నెల 28న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో 97,761 మంది విద్యార్థుల జాబితాను సంబంధిత సచివాలయాలకు పంపించాం. అర్హులందరికీ పథకం వర్తిస్తుంది.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

డైట్‌లో ఫస్ట్‌ర్యాంకు



అద్దంకి శ్రీచందన

పార్వతీపురంటౌన్: డైట్ ఫలితాల్లో పార్వతీపురం విద్యార్థిని ప్రతిభ చూపింది. పార్వతీపురం పట్టణం కంచర వీధికి చెందిన అద్దంకి శ్రీచందన ఫిజికల్ సైన్సు విభాగంలో రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించింది. తండ్రి వేణుగోపాలరావు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి మహాలక్ష్మి గృహిణి. తండ్రి ప్రోత్సాహంతో మంచి ర్యాంకు సాధించానని, టీచర్ కావాలన్నది లక్ష్యంగా పేర్కొంది.

ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల సంక్షేమానికి కృషి

- ఏపీఎస్పీ నాలుగవ రేంజ్ బెటాలియన్ డీఐజీ రాజకుమారి



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ రాజకుమారి

డెంకాడ: ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల సంక్షేమానికి ప్రభుత్వ సహకారంతో తనవంతు కృషి చేస్తానని ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ బి.రాజకుమారి తెలిపారు. ఏపీఎస్పీ చింతలవలస ఐదవ బెటాలియన్ పోలీసుల పరేడ్‌ను బుధవారం తిలకించి, గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బంది డ్రిల్, ఎంటీబీ ఆపరేషన్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది డెమోను వార్షిక తనిఖీలో భాగంగా చూశారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి జీఎస్ఈ, క్యాష్ రివార్డులను అందజేశారు. పోలీస్ దర్బార్‌లో సిబ్బంది సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు

- ప్రాధాన్యతా క్రమంలో కాలనీలో సౌకర్యాల కల్పన
- టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



సారిపల్లిలో టిడ్కో ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విజయనగరం/నెల్లిమర్ల: నివాసయోగ్యానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి త్వరలో సారిపల్లిలోని 16 నుంచి 30 బ్లాక్‌ల గృహ సముదాయాలను లబ్ధిదారులకు అప్పగిస్తామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ స్పష్టంచేశారు. టిడ్కో ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం నివసిస్తున్న గృహస్తుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రి, బస్సు సదుపాయాలు లేక కాస్త ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు తెలపగా.. దశలవారీగా అన్ని సదుపాయాలు సమకూరుతాయని ఆయన సమాధానమిచ్చారు. అనంతరం సోనియానగర్, నెల్లిమర్ల నగర పంచాయతీలోని టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. జియో ట్యాగింగ్ తీరును కమిషనర్లు ఆర్.శ్రీరాములునాయుడు, పి.బాలాజీప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల డిపాజిట్ల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లిమర్ల నగరపంచాయతీకి సంబంధించి నిర్మాణంలోనున్న 576 జీ ప్లస్‌త్రీ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి, లబ్ధిదారులకు కేటాయించాలని కాంట్రాక్టు ప్రతినిధులకు సూచించారు. ఆయన వెంట టిడ్కో ఎస్ఈ డి.నరసింహమూర్తి, ఈఈ బి.జ్యోతి, డీఈ బాలకృష్ణ, ఏఈ రాజీవ్‌గాంధీ, సీఎల్‌టీసీ ఎస్.వెంకటరమణ, మెప్మా సీఎంఎం డి.గోవిందరావు ఉన్నారు.

'ఎల్' ఫామ్ అప్‌లోడ్ తప్పనిసరి

- డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ప్రతి ల్యాబ్‌లో ఎల్.ఫామ్‌ను ఐహెచ్ఐపీ (ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం) యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్య సిబ్బందికి ఐహెచ్ఐపీ యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టీబీ, ర్యాబిస్, మ్యూకోర్ మైకోసిస్, సంక్రమిత వ్యాధులు వంటి వాటిని గుర్తించేందుకు 'పి'ఫామ్, 'ఎల్'ఫామ్‌లను ఐహెచ్ఐపీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేలైన్స్ అధికారి ఎం.తులసి, డెమో వి.చిన్నతల్లి, ఏపీ డిమాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డేటా మేనేజర్, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' అమలుకు ముందస్తు ప్రణాళిక



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మండలాధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష, గృహనిర్మాణం, ప్రాధాన్యత భవనాల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో 24వ తేదీ నుంచి ప్రారంభిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అవసరాలను ముందుగా తెలుసుకొని, సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మండల టీం వచ్చే సమయానికి సర్టిఫికెట్ల పంపిణీ, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా పట్టణ ప్రాంతంలో 27,142 ఇళ్లు మంజూరు కాగా అందులో ఇంకా 4,100 గ్రౌండింగ్ కాలేదని, వారం రోజుల్లో గ్రౌడింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో 7,306 మంజూరుగా ఇంకా 1,600 ఇళ్లు గ్రౌండింగ్ చేసి, వాటిని నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. జేసీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో 5,125 మంది కౌలుదారులకు కౌలుగుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 25వ తేదీ నాటికి సచివాలయం పరిధిలో కనీసం ఒకటి చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డీపీఓ బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలోని సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డీసీడీసీ) తొలి సమావేశంలో ఆమె మాట్లాడారు. సహకార సంఘాల కార్యకలాపాలను విస్తృతం చేసి, వాటి ఆదాయం పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కొన్ని సంఘాల కార్యకలాపాలు నామమాత్రంగా ఉన్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను వినియోగించుకొని వాటి పరిధి పెంచాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఏర్పాటైన సహకార సంఘాల కార్యకలాపాలపై ఆరా తీశారు. జిల్లా సహకార అధికారి పి.రమేష్ మాట్లాడుతూ దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సహకార శాఖను ఏర్పాటు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రకాల సహకార సంఘాలు సుమారుగా 5 లక్షల వరకు ఉన్నాయని, వీటన్నిటి వివరాలను ఎన్‌సీడీబీలో పొందుపరచమని ప్రభుత్వం ఆదేశించినట్టు వివరించారు. తొలివిడతగా పీఏసీఎస్‌లు, మత్స్య, డెయిరీ రంగంలోని సహకార సంఘాలను ఆన్‌లైన్లో నమోదుచేశామన్నారు. జిల్లాలో ఏపీ కో ఆపరేటివ్ సొసైటీ చట్టం–1964 ప్రకారం నమోదైన సంఘాలు 454, ఏపీ ఎంఏసీఎస్ యాక్ట్–1995 ప్రకారం నమోదైన సంఘాలు 1784 ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, డీపీఓ శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశుసంవర్థక శాఖ జేడీ విశ్వేశ్వరరావు, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ బీఎస్ఆర్ గుప్త, మత్స్యకార ఫెడరేషన్ ప్రతనిధి బర్రి చిన్నప్పన్న, నాబార్డు డీడీఎం నాగార్జున, పరిశ్రమలశాఖ డీడీ నాగేశ్వరరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ పాల్గొన్నారు.

యోగా డే

ప్రపంచ యోగా దినోత్సవం (ఈ నెల 21) ప్రాధాన్యతను దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల విద్యార్థులు అక్షర రూపంలో మంగళవారం వివరించారు. యోగాసనాలను సాధన చేశారు. యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలియజేశారు.

– సీతంపేట



14 మంది ఎస్సైలకు బదిలీ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 14 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో బదిలీ అయిన ఎస్సైల వివరాలిలా ఉన్నాయి		
పేరు	ప్రస్తుత ప్రదేశం	బదిలీ అయిన ప్రదేశం
ఎస్.కె. ఫకృద్దీన్	పార్వతీపురం టౌన్	పాచిపెంట
ఎం.వి. రమణ	పాచిపెంట	వీరఘట్టం
వి. పాపారావు	సాలూరు టౌన్	డీసీఆర్‌బీ, పార్వతీపురం
కె. సీతారాం	బత్తిలి	కొటియా
వై అమ్మాన్ రావు	వీఆర్ పార్వతీపురం	బత్తిలి
పి. దినకర్	డీసీఆర్బీ పార్వతీపురం మన్యం	పార్వతీపురం టౌన్–ఎస్సై 1
పి.నారాయణ రావు	కొటియా	పార్వతీపురం టౌన్–ఎస్సై 2
పి. నరసింహ మూర్తి	పార్వతీపురం మన్యం హెచ్‌క్యూ	సాలూరు టౌన్ ఎస్సై–1
ఎన్ భాస్కరరావు	సీసీఎస్ పార్వతీపురం మన్యం	సాలూరు టౌన్ ఎస్సై –2
బి. లావణ్య	పార్వతీపురం మన్యం హెచ్‌క్యూ	దిశ సెల్ పార్వతీపురం
ఐ. రాజారావు	వీఆర్ పార్వతీపురం మన్యం	డీసీఆర్‌బీ, పార్వతీపురం
ఎంఎస్‌వీ ప్రసాదరావు	(వీఆర్) పార్వతీపురం మన్యం	సీసీఎస్ పార్వతీపురం మన్యం
బి. దేముడు	డీసీఆర్‌బీ పార్వతీపురం మన్యం	డీఎస్‌బీ పార్వతీపురం మన్యం
కె.విక్రమ రావు (వీఆర్)	పార్వతీపురం మన్యం	డీఎస్‌బీ పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

మలేరియా జిల్లా అధికారి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన గంటా వెంకటరమణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారిగా గంటా వెంకటరమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మన్యం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు జిల్లా మలేరియా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వ్యాధుల నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు.

24న జిల్లా స్థాయి ఎంపికలు

• సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం: రాష్ట్రంలోని కడపజిల్లాలో గల డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 4,5 తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 24న జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ మంగళవారం తెలిపారు. ఆ రోజు జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో జరిగే ఎంపిక పోటీల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను త్వరలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపించనున్నట్లు చెప్పారు.

163 మద్యం బాటిల్స్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మెంటాడ: మండలంలోని రాబంద, మీసాలపేట గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 163 మద్యం సీసాలను కొంపంగి వంతెన వద్ద పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ మంగళవారం తెలిపారు. ఈ ప్రాంతంలో అక్రమంగా మద్యం తరలిస్తారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు మాటువేసి పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదుచేశామన్నారు.

కోనాడలో 10 మద్యం సీసాలు..

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో అనధికారంగా 10 మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు భోగాపురం ఎక్సైజ్ ఎస్సై బి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన గుర్రాల పోలయ్య దగ్గర నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికారంగా బెల్టుషాపు నిర్వహించడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొత్తపేట నీళ్లట్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న కె.లక్ష్మణరావు (26) మంగళవారం రాత్రి బజాజ్ షోరూమ్ వద్ద ఎడ్లబండికి ఉరేసుకున్నాడు. లక్ష్మణరావు రెండేళ్లుగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. కుటుంబ కలహాలు, మనస్పర్థల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,070-00
బంగారం(22సి. 10గ్రా.)	55,070-00
వెండి (కిలో)	79,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

జగనన్న సురక్షకు సర్వం సిద్ధం

• 23న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి
• ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
• ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


ఉపముఖ్యమంత్రి పీడికరాజన్నదొర

సాలూరు: తన పాలనలో పార్టీల కతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో చారిత్రక నిర్ణయానికి తెరతీశారు. ఏవైనా కారణాల వల్ల ఎవరైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందనట్లయితే వారికి పథకాలు అందించేలా, సేవలకు సంబంధించి అవసరమైన పత్రాలు వెంటనే మంజూరుచేసే నూతన కార్యక్రమానికి నాంది పలికారు. ప్రజల వద్దకు నేరుగా వలంటీర్లు, సచివాలయ గృహసారథులను పంపించి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకోవడంతో పాటు వారికి పథకాలు లేదా పత్రాల మంజూరుకు సంబంధించి సమస్యలుంటే తెలుసుకుని వెంటనే పరిష్కరించే దిశగా జగనన్న సురక్ష కార్యక్రమానికి నాంది పలికారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 23న ప్రారంభించనున్నారు.

కార్యక్రమం విధివిధానాలు

ఈ నెల 24నుంచి వలంటీర్లు, గృహసారథులులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం ఆవశ్యకతను వివరిస్తారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటారు. పథకాలు, సేవలకు సంబంధించి ప్రజలు సమస్యలు తెలిపిన పక్షంలో వివరాలను తెలుసుకుని, సేవలకు సంబంధించి అవసరమైన ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్, మ్యుటేషన్‌లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్‌లో మొబైల్ నంబర్ అప్‌డేషన్, క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డులు వంటివి మంజూరు గురించి వివరిస్తారు. ఎవరైనా పథకాలు, సేవలకు సంబంధించిన సమస్యలు చెప్తే వాటికి సంబంధించి అవసరమైన దరఖాస్తులను తీసుకుని సచివాలయంలో అందజేస్తారు.

కార్యాచరణ ఇలా

ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తారు. వారంలో మూడు సచివాలయాల చొప్పున నెలరోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్‌లు ఒక టీమ్‌గా, తహసీల్దార్, ఈఓపీఆర్‌డీ/మరో టీమ్‌గా ఏర్పాటవుతారు. మున్సిపాలిటీ, మండలంలోని అన్ని సచివాలయాల్లో ఈ క్యాంపు నిర్వహించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేశారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు 1న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లబ్ధి చేకూరుస్తారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అర్హులెవరైనా ఏవైనా సాంకేతిక, ఇతర కారణాల వల్ల పథకాలు పొందలేకపోతే వారిని గుర్తించి పథకాలు అందేలా చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన ప్రధాన సర్టిఫికెట్లు సత్వరమే ప్రజలకు అందించనున్నాం.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి

వైభవంగా జగన్నాథుని రథయాత్ర


జై జగన్నాథా అంటూ రథాన్ని లాగుతున్న పారిశ్రామిక బోర్డు డైరెక్టర్ బంగారునాయుడు, కార్పొరేటర్లు, భక్తులు


పూజలందుకుంటున్న జగన్నాథుడు

విజయనగరం టౌన్: జగన్నాథుని రథయాత్ర మహోత్సవం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన స్వామివారికి మంగళవారం విశిష్ట పూజలు నిర్వహించారు. తోమాలమందిరం వద్ద పూజల అనంతరం కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం వద్ద ఆలయ ఈఓ బీఎల్.నగేష్ నేతృత్వంలో స్వామివారి రథాన్ని ఆలయం ఆవరణలో ఉంచారు. అనంతరం జగన్నాథపురంలోని గుండిచా మందిరం వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా స్వామికి పారిశ్రామిక బోర్డు డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, కార్పొరేటర్‌లు మీసాల రమాదేవి, అల్లు చాణక్య, దాతలు ముచ్చు రామలింగస్వామి, బొడ్డు పండు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మాటూరు సతీష్, ధర్మకర్తలు అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించి తరించారు. అదే విధంగా దాసన్నపేట, సంతపేట, మూడుకోవెళ్ల వద్ద నిర్వహించిన జగన్నాథస్వామి రథయాత్రను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగంచేసుకోవాలి

• రీజనల్ మేనేజర్ రాఘువేంద్ర


పాస్‌బుక్ ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ రాఘువేంద్ర

పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా అందజేస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర కోరారు. ఈ మేరకు పార్వతీపురం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖ పరిధి తురకనాయుడు వలస గ్రామంలో బ్యాంకుమిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాస్‌బుక్ ప్రింటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకు సేవలను మరింత సులభతరం చేసేందుకు, ఖాతాదారుల సౌలభ్యం కోసం ఆయా గ్రామాల్లో సీఎస్‌పీలను ఏర్పాటు చేశామన్నారు. తోటపల్లి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ గంట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇక నుంచి సీఎస్పీల వద్ద ఏర్పాటు చేసిన ప్రింటర్ ద్వారా పాస్‌బుక్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వాసు, డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో షూటింగ్ సందడి


వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న షూటింగ్

విజయనగరం టౌన్: శ్రీ లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌లో అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న నూతన చిత్రం షూటింగ్‌ను విజయనగరంలోని గంటస్తంభం, కోట, మహారాజా కళాశాల తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం షూటింగ్ సందడి నెలకొంది. మహేష్ బాబు మేనల్లుడు గల్లా అశోక్ హీరోగా రెండో చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి సోమినేని బాలకృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు


పిడుగుపడి కాలిపోతున్న కొబ్బరిచెట్టు

శృంగవరపుకోట: ఎస్.కోట-విశాఖ అరకు ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కొబ్బరిచెట్టుపై మంగళవారం రాత్రి 8గంటల సమయంలో పిడుగుపడి మంటలు రేగాయి. దీంతో పచ్చటి కొబ్బరి చెట్టు మొవ్వు భగభగ కాలడంతో రోడ్డున పోతున్న వారంతా నిశ్చేష్టులై చూశారు. సమీపంలోని అగ్నిమాపక శాఖ సిబ్బందికి విషయం తెలియజేయగా హుటాహుటిన వారు వచ్చి మంటలు ఆర్పారు.

సీతం విద్యార్థినికి అవార్డు

• ప్రదానం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి


సీఎం జగన్‌మోహన్ రెడ్డి నుంచి అభినందనలు అందుకుంటున్న అన్నా నేహథామస్

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న అన్నా నేహా థామస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలోని 'ఇన్‌స్పిరేషనల్ స్టూడెంట్ అవార్డు-2023కు ఎంపికైంది. ఈ అవార్డును మంగళవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ఆమెకు ప్రదానం చేశారు. ఈ మేరకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అన్నా నేహథామస్ చదువుతోపాటు శాస్త్రీయ నృత్యంలోనూ అలాగే ఎన్‌సీసీ విభాగంలో ప్రతిభ కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 26న డిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే ఎన్‌సీసీ పరేడ్‌లో ఆమె పాల్గొందని విద్యార్థులంతా ఆమెను ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో వృద్ధిచెందాలని కోరారు. అన్నా నేహథామస్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం


ధర్మారావు(ఫైల్)

పార్వతీపురం/కొమరాడ: అవసాన దశలో ఆదుకుంటాడనుకున్న కుమారుడు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. గుర్తు తెలియని వాహనం ఢీకొని కుమారుడు మృతి చెందడంతో కంటికిమింటికి ఏకధారగా రోదిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన వై.భీమయ్య, పద్మ దంపతుల కుమారుడు ధర్మారావు(27)బీటెక్ చదివి విశాఖపట్నంలోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో ఉంటున్న ఆ యువకుడు మూడు రోజుల క్రితం తల్లిదండ్రులను చూసేందుకు కోటిపాం వచ్చాడు. మంగళవారం ఉదయం తిరిగి విశాఖపట్నం వెళ్లిపోయేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో పార్వతీపురం సమీప మరిపివలస సమీపంలో కొద్దిపాటి వర్షం కురుస్తున్న సమయంలో గుర్తు తెలియని భారీ వాహనం బైక్‌ను ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. దీంతో ఆ వాహనం ధర్మారావును ఈడ్చుకు పోవడంతో శరీరం నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై వై.సింహచలం సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి డిగ్రీ చదువుతున్న చెల్లి ఉంది.

రైలు ఢీకొని మరొకరు..

పార్వతీపురం: మండలంలోని నర్సిపురం గ్రామానికి చెందిన కోట శ్రీరాములు(66) ఇంటినుంచి పొలానికి వెళ్తూ రైల్వేట్రాక్ దాటుతున్న సమయంలో సీతానగరంనుంచి పార్వతీపురంవైపు వెళ్తున్న రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరాములు మృతదేహం నుజ్జునుజ్జయింది. ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై రవివర్మ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కొట్టాడని ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: భర్త కొట్టాడని మనస్తాపం చెందిన భార్య ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలం చీడిగూడ గ్రామానికి చెందిన తోయక సుశీలకు భర్త వెంకటరావుకు మధ్య పిల్లలను పాఠశాలకు పంపే విషయమై ఉదయం చిన్న గొడవ జరిగింది. ఈ గొడవలో భర్త వెంకటరావు, సుశీలపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న ఎలుకలమందు తాగేసింది. ఈ విషయం గమనించిన భర్త వెంకటరావు చికిత్సకోసం మొండెంఖల్ పీహెచ్‌సీకి తరలించాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రిలో చేర్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు


చికిత్స పొందుతున్న ధనుంజయ తదితరులు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయాల పాలయ్యారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం నీచుకవలస గ్రామానికి చెందిన కోడూరు ధనుంజయ, చెల్లి మంగమ్మ, అబ్బాయి జశ్వంత్‌లు ఆస్పత్రి పనినిమిత్తం నీచుకవలస నుంచి పార్వతీపురం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొత్తవలస సమీపంలోగల ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చేసరికి, అదే మార్గంలో వెనుకనుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు కింద పడిపోగా పలుచోట్ల గాయాలయ్యాయి. తొలుత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరికి..

సీతానగరం మండలం సూరంపేట గ్రామానికి చెందిన గుగ్గిలాపు బంగారు శెట్టి, కొట్టక్కి నర్సింహులు సువర్ణముఖినదిలో అస్థికలను కలిపేందుకు ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి సీతానగరం వెళ్తుండగా అదే మార్గంలో అప్పయ్యపేట సమీపంలో వెనుకనుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడిపోగా పలుచోట్ల గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

మురుగునీరు విషయంలో గొడవ పడి..


చికిత్సపొందుతున్న రమణమ్మ

మురుగునీరు విషయమై ఇరుగుపొరుగు వారితో జరిగిన గొడవలో ఓ మహిళ గాయాలపాలయ్యాడు. పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలోని కొత్తవలసకు చెందిన మువ్వల రమణమ్మ పక్కింటి వాసులు ఎస్.అప్పలరాజు, భవానిల మధ్య మురుగునీరు నిల్వపై గొడవ జరిగింది. ఈ గొడవ కాస్త కొట్లాటకు దారితీయడంతో రమణమ్మను అప్పలరాజు, భవానిలు పలుచోట్ల గాయపరిచారు. దీంతో చికిత్స కోసం ఆమె జిల్లా ఆస్పత్రిలో చేరింది.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


దర్శించుకుంటున్న భక్తులు


ఆలయంలో చండీ హోమం నిర్వహించిన అర్చకులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో చండీయాగం నిర్వహించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అమ్మవారికి తీపిపదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు.

రీసర్వేలో లక్ష్యాలు అధిగమించాలి

• కలెక్టర్ నాగలక్ష్మి


రీసర్వేపై అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పూసపాటిరేగ: నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, జూలై నెలాఖరు నాటికి రెండో దశ పనులను పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే, రెవెన్యూ విభాగ అధికారులతో సమావేశమయ్యారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సంబంధిత డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. సాంకేతిక సమస్యను అధిగమించి నిర్ణీతగడువులోగా రెండోదశ రీసర్వే పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె కంప్యూటర్‌లో లాగిన్ అయి రెండో దశలో భాగంగా పూసపాటిరేగ మండలంలో రీసర్వే జరుగుతున్న 11 గ్రామాల తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. ఫలితాలు తక్కువగా ఉన్న గ్రామాల్లో వేగం పెంచాలని అవసరమైతే అదనపు సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. మొదటి దశలో సర్వే పూర్తయిన కృష్ణాపురంలో ఇబ్బందులు తలెత్తాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మరోసారి పరిశీలించి చక్కదిద్దాలని సలహా ఇచ్చారు. రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాలలో రైతుల పాస్‌పుస్తకాలకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు. అలాగే ఎల్‌పీఎం నంబర్ ఆధారంగా మ్యుటేషన్ చేయాలని కలెక్టర్ నిర్దేశించారు. ఆటో అప్‌డేషన్ అయ్యే విధంగా వివరాలు పొందుపరచాలని సూచించారు. ఆమెతోపాటు విజయనగరం ఆర్‌డీఓ సూర్యకళ, సర్వే విభాగపు ఎ.డి త్రివిక్రమరావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, మండల సర్వేయర్ గణపతిరావుతో పాటు గ్రామసర్వేయర్లు, వీఆర్‌ఓలు సమావేశంలో పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

• జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించామని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ల నేతృత్వంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి పట్టణంలో ఉన్న పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రూ.15.45 లక్షల స్టాక్‌ను సీజ్ చేశామన్నారు. స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు చేపట్టడం, నిల్వలు-ధరల పట్టికను ప్రదర్శించకపోవడం, అధీకృత తయారీదారుల నుంచి కొనుగోలు చేసిన ఇన్వాయిస్-సోర్స్ సర్టిఫికెట్స్ నివేదించలేకపోవడం తదితర ఉల్లంఘనలను గుర్తించినట్లు చెప్పారు. సంబంధిత డీలర్లపై నిత్యావసర నిల్వల చట్టం (ఈసీ యాక్ట్) 1955, విత్తన చట్టం 1966 -పురుగుమందుల చట్టం 1968 ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

• జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్


యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. వైఎస్‌కే ఇన్ఫోటెక్, వారాహ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 103 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా వారిలో 37 మంది ఎంపికైనట్లు తెలిపారు. పార్వతీపురం ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఇప్పటివరకు 7 జాబ్ మేళాలు నిర్వహించామని కళాశాల తరఫున సహాయ సహకారాలు అందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీపీసీ సీతారాం, ఎల్‌డీఎం శ్రీమూర్తి, నైపుణ్యాభివృద్ధిశాఖ సిబ్బంది పాల్గొన్నారు.